# భేతాళుడు చెప్పిన యమధర్మరాజు ఏజంటు కధ

— ఎమ్. రాధాకిషన్



పట్టువదలని విక్రమార్కుడు ఎప్పటిలాగే చెట్టెక్కి శవాన్ని దించి భుజాన వేసుకుని శ్మశానం వైపు మౌనంగా నడవసాగాడు. అప్పుడు శవంలోని భేతాళుడు "ఓ విక్రమార్క మహారాజా! నీకు శ్రమ తెలియకుండా ఉండేందుకు నేనో స్టోరీ" చెబుతాను అని కథ చెప్పడం ప్రారంభించాడు.

అనగా అనగా ఓ ముత్యాలమ్మ మూడ్రోజులపాటు మూసిన కన్ను తెరవలేదు. దానిక్కారణం జ్వరం! దానికో లెక్కా డొక్కా లేనట్టు ఎడా పెడా ఎలాపడితే అలా కాసే పింది పాడు జ్వరం! మాయదారి జ్వరం!!

మొన్రోజు ముత్యాలమ్మ ముసుగు తన్నినాడు "ఏం—ఏం మాయదారి రోగవొచ్చినాదీ ముండకి?" అని సారా మైకంలో వ్యంగ్యమాడిన అదెయ్యే ఆ మర్నాడు ఆ జ్వర తీవ్రతకు బెంబే లెత్తిపోయాడు. (అప్పుడు వాడ వొంట్లో సారాలేదు. నోట్లో దాని తాలూకు కంపుమాత్రమే మిగిలింది) "ఒరేయ్ ఒళ్ళా ఇది విప్పుల కుంపటా?" అని బేజారెత్తిపోయి డాక్టరు దగ్గరికి పరుగుదీశాడు. విషయం విన్నవించి—

"ముసలిముండ బాబూ, నడి సేట్టు కూడా లేదు. తమరో పాలి దయసేయాలి. దాని పేణం నిల బెట్టాల. అదొక్కతే బాబూ మాకు పెద్ద దిక్కు. అది సల్లగుంతేనే మావూ సల్లగుంతాం. మీ రున ఉంచీసుకోను. సెర్మం వొలిసి సెప్పులు కుట్టించయినా తీరిసేసు కుంతాను" అని కాళ్ళు పట్టుకోలేదు గాని పట్టుకున్నంత పని చేసాడు.

"ఎవరి సెర్మం సీదా ఆ ముసలి దానిదా?" అని జోకెయ్యబోయి బావుండదనుకున్నాడో, లేక ఏ మూలనో కాస్తంత మంచితనం దాగుండి మనసొప్పకో లేదో గాని మొత్తానికి ఊరుకుండి పోయాడు సదరు డాకటేరుబాబు. అతగాడి నిజ నామధేయం కూడా బాబే. డా॥ కె.ఆర్.ఎస్. బాబు. ఆ బాబుకున్న తోక ఎమ్బీబియెస్సాదు ఆరెమ్.

ఐతే తోకేమిటన్నది ఆ పల్లె లాంటి మరీ చిన్న పల్లెల్లో పెద్ద పాయింట్ కాదు. తోకేదైనా డాకటేరు డాకటేరే. పొయ్యే పేణాన్ని పగ్గవేసి లాగి నిలబెట్టే వోడు. అంటే సాచ్చాత్తూ ఆ భగ వంతుడితో సవానవన్నమాట!

భగవంతుడు అడ్డమైన వాళ్ళనీ కనికరించేయడు. అలాగే డాకటే రున్నూ. అడ్డమైన పెతీవోడి

గెడపా తొక్క దానికి ఆదేం అడ్డ గాడిద కాదు!

ఆ మాటే అన్నాడు డా॥ కె. ఆర్ ఎస్ బాబు. అరెమ్డ్ "అడ్డమైన ప్రతివాడింటికీ వాలంటే మాకెక్కడ విలవ్వుదయ్యా? తే గలిగితే ఆ ముసలిదాన్నిక్కడికి తీసుకురా లేదా ఈ మందూ మాత్రలూ తీసుకెళ్ళి మింగించు" అంటూ రెండు మాత్రలు పొట్లాం గట్టి ఆదెయ్య చేతబెట్టి "ఈ సీసా పట్టు మందుకి" అన్నాడు వాడు ముసలిదాన్ని ఎలాగూ తేలేడని ముందే ఊహించేసినట్టు.

"సీసాయా తీసుకురానేదు బాబూ! ఐనా ఈటితో ఏటవుద్ది బాబూ? తమరు సూణ్ణేదుదాని జొరవంటే జొరం గాదు బాబూ అది అగ్గి! ఆ అగ్గి సల్లబడి మా ముసలిదాని పేణాం నిలబడిపోవా లంటే తమరోపాలి రాక తప్పదు" అన్నాడు ఆదెయ్య మాత్రల పొట్లాన్ని బల్లమీదుంచేస్తూ.

డా॥ కె. ఆర్.. ఎస్. బాబు, అరెమ్డ్ ఆదెయ్యవేపు ఎగాదిగా చూశాడు. పైనుంచి కిందికీ కింది నుంచి పైకీ చూశాడు. కళ్ళు చిట్లించీ చూసాడు పూర్తిగా విప్పుకునీ చూశాడు.

మహారాత్తే ఓ ఐదు రాలేను లేదా పది రాలేను. అంతకుమించి మరొక్క పైసా కూడా రాలదు. అనిపించింది అతగాడికి ఆదెయ్య వాలకాన్నిబట్టి.

ఐదుకీ పదికీ కక్కుర్తి పడితే అవారకంకాదు డాకటేరు బాబు. కావకాశికి అది పల్లెఐనా, అతగాడు అరెమ్మేనైనా అతగాడికి బోలెడంత పిర్రేకటీను! ఆ పల్లె కొక్కదానికే కాదు ఆ చుట్టు పట్ల ఐదారు పల్లెలకు అతగాడు ఎక్కైక డాకటేరు! ఆ పల్లెల్లో ఏ ఒక్క దానికీ పాతికమైళ్ళ లోపు మరో వైద్యసదుపాయమేదీ లేకపోవడం వలన సచ్చినట్టు రోగాలొచ్చిన వాళ్ళంతా చస్తూ బతుకుతూ ఇత గాడి దగ్గరికే వస్తారు! అంచేత బోలెడంత పిర్రేకటీసూ, బోలె డంత ఇన్కమ్మూ అతగాడికి. అంచేత మరీ కలిగినోళ్ళయితేనె తప్ప ఎవ్వరికీ వెళ్ళడు!

ససేమిరా రావడానికి వీల్లే దన్నాడు డాకటేరు బాబు.

"తవరలాగనీకండి బాబూ దయతలసాల తవరు" అంటూ కాళ్ళమీద అంతకుముందు పడలేదు గాని ఇప్పుడు నిజంగానే పడ్డాడు ఆదెయ్య.

"పాతికవ్వుది మరి!" అని 'ఏవంటావ్' అన్నట్టు చూశాడు

డా॥ కె.ఆర్.ఎ. బాబు, ఆరెమ్మే.

"తప్పుదేటి బాబూ! అలాగే" అన్నాడు ఆదెయ్య.

"అలాగే అది గానుగెద్దులా బుర్రాడించేయగానే సరిపోదు. డబ్బు ముందుగా ఇవ్వాలి. ఇస్తేనే నేను కదిలేది."

"తవఁరు ముందు రండి బాబూ, అక్కడిప్పిస్తాగా?" అన్నాడు ఆదుర్దాగా ఆదెయ్య.

"ఆఁ ఆఁ—ఇప్పియస్తావ్!" అది ఫెళ్ళున నవ్వేడు డాకటేరు బాబు. దేశంలోని దారిద్ర్యానికి ప్రతిరూపంలా వున్న ఆదెయ్య అవతారాన్ని చూసి డాకటేరుబాబు జోకర్థం చేసేసుకున్న కొందరు రోగులు కూడా ఫెళ్ళు ఫెళ్ళున నవ్వారు. (అలాగని వాళ్ళందర్కీ వచ్చిన రోగం నవ్వటం కాదు. రోగాలు వేరే వేరే. నవ్వొక్కటే కామను.)

నవ్విన రోగులకేసి చల్లగా చూసి, ఆదెయ్య కేసి అదోలా చూసి, "అదేం కుదరదోయ్! ఇప్పుడు నీ చేతిలో వుంటే చెప్పు వస్తా. లేకపోతే లగెత్తు" అన్నాడు డాకటేరుబాబు.

లగెత్తాడు ఆదినారాయణ.

లగెత్తుకొని ఇంటి కెల్పోయొచ్చేసేడు. తిరిగి డాకటేరుబాబు బాబు కాడికి—చేత పాతిక రూపాయల్తో.

అతగాడికేసి "శభాష్" అన్నట్టు చూశాడు డా॥ కె.ఆర్.ఎస్. బాబు' చూపి "నడు" అన్నాడు పాతిక జేబులో పెట్టుకొని, మందుల కిట్టు ఆదెయ్య చేతికిస్తూ.

కిట్టందుకొని నడిచాడు ఆదెయ్య. అతన్ని వెన్నంటాడుడాకటేరుబాబు.

డాకటేరు బాబంటే సాచ్చాతూ ఆ భగమంతుడవతారం అని ఇందాకే చెప్పడం జరిగింది.

భగవన్మానుడైన ఈ డా॥ కె.ఆర్.ఎస్. బాబు టెక్నికల్ బ్రెయిను.అతగాడికి చాలా టెక్కు-విక్కులు తెలుసు.కొన్నిటావిక్కుల పేర్లూ, టాబ్లెట్లుపేరూ, ఇంజక్షన్ల పేరూకూడా తెలుసు. గొట్టంలోకి మందులాగి మనిషి శరీరంలోకి తొయ్యడం కూడా తెలుసు. తెలవబట్టేగా అడిగాడు డాకటేరయ్యాడు! అదలా వుంచి అసలు విషయమైన టెక్కు-విక్కుల విషయానికొస్తే అందులో ముఖ్యమైనది.

అతగాడు తాను టెకప్పు చేసిన ఏ కేసులోకైనా ముందుగా రోగాన్ని అప్పు (UP) చేస్తాడు తన శాయశక్తులా ప్రయత్నించి. ఆ తర్వాత తనకు తెలిసిన వైద్య పరిజ్ఞానాన్నంతా వుపయోగించి

నెమ్మది నెమ్మదిగా డౌన్ చేస్తాడు. అలా చేస్తే బాగా కష్టపడ్డాడు డాకటేరుబాబని ఫీజు ఎక్కువగా ముట్టజెపుతారు ప్రజలని అతగాడి నమ్మిక. నమ్మికంటే కేవలం నమ్మిక మాత్రమే కాదు; వాస్త వానికి అలానే జరుగుద్ది. జరుగు తుంది కూడా. ఒక్క సూదిపోటు తోనే రోగాన్ని తగ్గించేస్తే తనేం తినాలి? మన్ను, లేదంటే బూడిద.

ముత్యాలమ్మ పల్సు చూసి, గుండె మీద స్టెతు పెట్టి గుడగుడ శబ్దం విని, నోట్లో గాజుపుల్ల పెట్టి జొరం కొలిసి. "నూట దెబ్బ య్యింది. చాలా ప్రమాదకరమైన జ్వరం. ప్రాణానికే ముప్పు రావచ్చు. అయినా నా శాయ శక్తులా ప్రయత్నిస్తాను కాని నువ్విచ్చిన సొమ్ము మందులకే సరిపోదు. కాబట్టి ఎందుకైనా మంచిది మరో పాతిక చూసుంచు" అని అదెయ్యకు ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చి, ముసల్దానికో 'డి డబ్ల్యు' ఇంజక్షనిచ్చి (అనగా డిస్టిల్డు వాటరు. అనగా మరగ్గాసిన నీళ్ళు. ఆ సంగతి అదెయ్యకు బోధపడ దన్న భరోసా వుండటంవల్ల ఆ ముక్కపైకే చెప్పేశాడు—చాలా పవర్‌ఫుల్ 'డి. డబ్ల్యు' ఇంజక్ష నిచ్చానోయ్. అపైన నీ అదృష్టం అపైన ముసల్దానిఅదృష్టం" అని.) అంతలోనే 'డి.డబ్ల్యు'తోకొంపదీసి ఈముసల్దిగాని లేచి కూచుంటే రేపు రాలే పాతిక రాలవేమో నన్న భయం పుట్టి, ముసల్దాన్ని మత్తులో ముంచేస్తే ఇతగాడు భేజారైపోయి పరిగెత్తుకొస్తాడన్న నమ్మకం పుట్టి సెడేటివ్ ఇంజక్షన్ మరొకటిచ్చి (అనగా మత్తు-జక్షను. అనగా రోగిని నిద్రపుచ్చే యింజక్షను.) "ముసల్దిగాని మళ్ళీ గాని కంగారు చేస్తే కబురెట్టవోయ్, వస్తా" నంటూ ఓ చేత్తో కిట్టూ, మరో చేత్తో స్టెత్తూ పూపుకుంటూ ఇంటి ముఖం పట్టాడు.

"మరో పాతిక చూసుంచు" అన్న మాటల్తో గుండెలపిపోయిన అదెయ్య, "అలాగే బాబూ" అని నీరసంగా తలూపి ఆలోచనలో పడిపోయాడు.

"ఎటి మావాఁ ఆలోచనలో పడిపోనావు?" అంది అతగాడి ప్రస్తుత భార్యా, ఒకప్పటి మేన కోడలూ అయిన నూకాలమ్మ.

"ఇన్నావు గావా; చాలా పెమాదం. ఈ సూదులికి తగ్గక పోవచ్చు. మరో పాతిక చూసుంచు మన్నాడు డాకటేరు. ఉప్పుడేటి సేయడం?" అన్నాడు అదెయ్య దిగాలు ముఖంతో.

"ఏదోటి సేద్దాంలే మామా; సూత్తూ సూత్తూ మడిపివి సంపేసుకుంటావేటి?" అంది నూకాలమ్మ. ఏదో పై కలా అందేగాని, మనసులో ఆమెకీ గుబురుగానే వుంది 'ఏటి సేయడమా?' అని. ఇయ్యాలంటే పమయానికి కాళ్ళకి పట్టీలుండబట్టి అయ్యేడ్డు పడ్డాయి. రేపేటిసేయడం?

ప్రతి ప్రశ్నకూ ఏదో ఒక జవాబుండి తీరుంది! "రేపేటి పేయడం?" అనే ప్రశ్నకి ఆ ఇంట (గుడిశెలో) వున్న ఏకైక ఇత్తడి బిందె జవాబుగా నిలిచింది.


మర్నాడు దాన్ని కుదువపెట్టి పాతిక రూపాయల్దెచ్చి మొగుడి చేతిలో పోసింది నూకాలమ్మ. వాడు వాటిల్ని తీసుకెళ్ళి డాకటేరు చేతిలో పోసేసేడు. సదరు డాకటేరు వాటిల్ని జేబులో పెట్టుకొని, ముసలావి జబ్బలో ఏదో పొడిసేడు. పొడివేసి, "మరేం భయంలేదు. రేపటికల్లా లేచి తిరుగాడద్ది మీయమ్మ" అనేపి వెళ్ళిపోయాడు. నిజమే గావల్నను కున్నారు ఆదెయ్యా, అతగాడి భార్యా. కాని ముత్యాలమ్మ నాలుగోనాడు కళ్ళు తెరవలేదు సరిగదా, శాశ్వతంగా మూసేసుకుంది వాటిల్ని.

లబో దిబో మంటూ డాకటేరు బాబు దగ్గరికి లగెత్తుకెళ్ళి "ఇదేటి ఇలాగయిపోనా" దన్నాడు ఆదెయ్య.

"ఆయుస్సు మూడితే అలాగే అవుద్ది మరి. నేను డాక్టర్నేగాని భగవంతుణ్ణిం గాదు. నా ప్రయత్నం నేను చేశానుకాని లాభం లేక పోయింది. దానికి నేనేం చేయగలను? పోయే ప్రాణాన్ని ఎవ్వరూ ఆపలేరు" అనేసేడు డాకటేరు బాబు కాదు డా॥ కె. ఆర్. ఎస్. బాబు, ఆరెమ్మ్.

నిజమే. పోయే ప్రాణాన్ని ఎవ్వరూ ఆపలేరు. కాని వున్న ప్రాణాన్ని తీసేయడం బహుతేలిక! డా॥ కె. ఆర్. ఎస్. బాబు, ఆరెమ్మ్ ముసల్దానికి మూడోనాడు పాపం మంచిమందే అదిన్నూ మోతాదుకు మించి యిచ్చాడు. కాని ముసల్దానికి ఆయువు మూడి పోవడంవల్ల అది కాస్తా విషతుల్యమై దాని పాలిట మృత్యువై పోయింది! అయితే ముసల్ది కేవలం డ్రగ్ రియాక్షన్ వల్లే చచ్చిపోయిం దని, ఆయువు మూడి మాత్రం కాదనీ డాక్టర్ కె. ఆర్. ఎస్. బాబు, ఆరుమ్మ్కి తెలియదు. ఒక వేళ తెలిపినా అతను విషయాన్ని బయట పెట్టడు. పెడితే అది తన వృత్తికే కళంకం గదా!

ఇక్కడ డాక్టర్ కె. ఆర్. ఎస్.




బాబు, ఆరెమ్డ్ గత చరిత్రగురించి కొంచెం చెప్పుకోవడం అవసరం. అతగాడు మూడేళ్ళ క్రితం దాకా డాకటేరు కాదు. యాకటేరు.

"నాటకాలేసి చెడిపోతున్నాడురా మీ అల్లుడు, ఎలాగైనా వాణ్ణో దారిలో పెట్టు" అని కె ఆర్. ఎస్. బాబు తల్లి మూడేళ్ళ క్రితం తన తమ్ముడైన యమ్. ధర్మరాజుతో చెప్పుకుని బాధపడిందో రోజు. ఆ యమ్. ధర్మరాజుకి ఓ యమా వికారమైన కూతురుంది. సదరు యమా వికారపు కూతుర్ని చేసుకోవడానికి ఏ యమా యమా వెధవ కూడా ముందుకు రావడం లేదు. ఆ కూతుర్ని, మన కె. ఆర్. ఎస్. బాబుసీ ప్రక్క-ప్రక్కన వూహించుకొని "ఓస్ అదెంతపని? నెలతిరిగేసరికల్లా ఈణ్ణి డాక్టర్ని చేసేస్తాను చూ"డన్నాడు యమ్. ధర్మరాజు. "ఏరా డాక్టరు వౌతావా?" అంటే "ఊఁ" అన్నాడు కె. ఆర్. ఎస్. బాబు. అంతే యమ్. ధర్మరాజు కె. ఆర్. ఎస్. బాబుకి కొన్ని ఇంజక్షన్లూ, టానిక్కులూ, మాత్రలూ వగైరాల గురించిచెప్పి, ఏవేవో ప్రయత్నాలుచేసి ఆరెమ్డ్ అని ఓ సర్టిఫికేటు పుట్టించి, అతగాణ్ణి ఈపల్లెకు తోలేశాడు. "వెళ్ళు ప్రాక్టీసు మొదలెట్టు. మందులు మాత్రం మన కొట్లోనే కొనాలి సుమా!" అంటూ. యమ్. ధర్మరాజుకి పట్నంలో చిన్న మందుల షాపువుంది. అల్లుడివైద్యం తన వ్యాపారాన్ని కొంత ప్రమోట్ చెయ్యకపోతుందా? అనుకున్నాడు. అయితే ఓ నాలుగునెలలు తిరిగేసరికల్లా టెక్నికల్ బ్రెయిన్ గల మన డాక్టర్ కె. ఆర్. ఎస్. బాబు, మామగారి వ్యాపారాన్ని కొంత ప్రమోట్ చేయడం కాదు, తన విపరీతమైన పిరాకటీసుతో

అపల్లెలో యమ్ ధర్మరాజు వ్యాపారానికి ఓ ప్రతినిధిలా అయ్యాడు. అంటే ఏజంటయ్యాడన్నమాట! (ఆ తర్వాత అల్లుడు కూడా అయ్యేడు గాని అది వేరేసంగతి!) కాబట్టి డాక్టర్ కె.ఆర్.ఎస్. బాబు, ఆరెమ్మిని యమ్ ధర్మరాజు ఏజంటు అని కూడా అనొచ్చన్నమాట!

ఈ యమ్ధర్మరాజు ఏజంటుకి ఏభయ్ రూపాయలు ముడుపు గట్టి మరీ తవ తల్లిని తానే చంపుకున్నానని ఆదెయ్యకు తెలియలేదు. తెలిస్తే అతను గుండెలు బాదుకొని తానైనా చచ్చిపోయుండేవాడు లేదా డాకటేరు బాబునైనా చంపేసుండేవాడు! కాని తెలియలేదు. తెలియలేదు కాబట్టే—"ఆయువు మూడితే ఎవులవేం సేయగలం? ఆ కాడికీ కాడుగ్గా నేను సేయాల్సింది సేసిన్ను. డాకటేరుకి సూపినాను గానా?" అన్న తృప్తి అతడిలో మిగిలిపోయింది.

యమ్ధర్మరాజు ఏజంటుకి తెలుసు. తన అర్ధ పరిజ్ఞానపు వైద్యం వల్ల అడపాదడపా కొన్ని విందు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని. ఐనా అతనికి చీమైనా గుట్టదు. ఎందుకంటే అతక్కావలసింది కేవలం డబ్బు. ఆ డబ్బు ముమ్మరంగా ముంగాళ్ళ ముందుకొచ్చి పడమంటే ఎన్ని ప్రాణాలు పోతేనేం? ఆ పోయే ప్రాణాలు మరులవి గాని, తనవి కాదు గదా? కాబట్టి అతన్ని చీమ కుట్టకపోవడంలో తప్పులేదు.

అని కథ ముగించి,

"మన ప్రభుత్వంవారిని ప్రతి పల్లెలోను ఇలాంటి యమ్ధర్మరాజు ఏజంట్లున్నారని బాగా తెల్సు గదా! గ్రామాల అభ్యుదయానికి మేం ఇంత చేస్తున్నాం అంత చేస్తున్నాం అని అనునిత్యం వారు బాకాలు వూదుతూ చెబుతుంటారు గదా, మరి అలాంటప్పుడు ఈ యమ్ధర్మరాజు ఏజంట్ల బారినుండి ఆదెయ్యలాంటి అమాయకుల్ని, ముత్యాలమ్మలాంటి అభాగ్య ప్రాణాల్ని కాపాడరెందుకని?" అని ప్రశ్నించి "ఓ విక్రమార్క మహారాజా! ఈ ప్రశ్నకు జవాబు తెలిసి కూడా చెప్పలేకపోయావో నీ తల థౌజండ్ పీసెస్ అయిపోతుంది జాగ్రత్త!" అన్నాడు భేతాళుడు

తెలిసికూడా చెప్పకపోతే కదా నీ తల థౌజండ్ పీసెస్ అయ్యేది?

అంచేత విక్రమార్కుడు విర్పితిగా శవాన్ని, శవంలోని భేతాళుణ్ణి మోసుకుంటూ మౌనంగా శ్మశానం వేపు సాగిపోయాడు. *